# ఆదిలాబాద్ వార్త



మంచిర్యాల, కొమురం భీం ఆసిఫాబాద్, నిర్మల్

మంగళవారం 31, మార్చి 2026


# బాధితులకు సత్వర న్యాయం జరిగేలా చూడాలి



**ఆసిఫాబాద్ ప్రతినిధి, మార్చి 30, ప్రభాతవార్త**

బాధితులకు సత్వర న్యాయం జరిగేలా చూడాలని జిల్లా ఎస్పీ నితికా పంత్ పోలీస్ అధికారులకు సూచించారు. సోమవారం జిల్లా కేంద్రంలోని జిల్లా పోలీస్ కార్యాలయంలో నిర్వహించిన ప్రజావాణిలో ఫిర్యాదుదారుల సమస్యలను విని వాటిని చట్టప్రకారం పరిష్కరించాల్సిందిగా సంబందిత అధికారులకు సూచించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ ప్రజలు నిర్భయంగా మూడో వ్యక్తి ప్రమేయం లేకుండా ఎలాంటి పైరవీలు లేకుండా స్వచ్ఛందంగా పోలీసు సేవల్ని వినియోగించుకోవాలన్నారు. శాంతి భద్రతలు పరిరక్షిస్తూ ముందుకు సాగడమే లక్ష్యంగా జిల్లా పోలీస్ శాఖ పని చేస్తుందని జిల్లా ఎస్పీ తెలిపారు. ప్రజా సమస్యలపై ఫిర్యాదులు నేరుగా స్వీకరిస్తూ ప్రతి సోమవారం ప్రజావాణి కార్యక్రమం ద్వారా సమస్యలు పరిష్కారిస్తున్నామని, ప్రజావాణి కార్యక్రమంను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని వెల్లడించారు.



# జనగణన కార్యక్రమం సమర్థవంతంగా నిర్వహించాలి

* డైరెక్టర్ ఆఫ్ సెన్సస్ భారతి హోళీకేరి

**నస్పూర్, మార్చి 30, ప్రభాతవార్త**

జనగణన2027 మొదటి విడతలో భాగంగా ఇండ్ల గణన ప్రక్రియ సమర్థవంతంగా నిర్వహించాలని డైరెక్టర్ ఆఫ్ సెన్సస్ భారతి హోళీకేరి అన్నారు. సోమవారం హైదరాబాద్ నుంచి అన్ని జిల్లాల కలెక్టర్లు, జిల్లా జనగణన అధికారులతో జనగణన, ఇండ్ల గణన ప్రక్రియలు, మ్యాప్ తయారీ, ఎన్యుమరేటర్లు, సూపర్వైజర్ల నియామకం పై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా డైరెక్టర్ ఆఫ్ సెన్సస్ మాట్లాడుతూ జనగణన కార్యక్రమంలో భాగంగా ఇండ్ల గణన ప్రక్రియను సక్రమంగా నిర్వహించాలని, ప్రక్రియ నిర్వహణ, సాంకేతికత వినియోగంపై అవగాహన కలిగి ఉండాలని, ప్రభుత్వ మార్గదర్శకాలకు అనుగుణంగా సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించి గణన చేయాలని తెలిపారు. దేశంలోనే తొలిసారిగా జనగణనను పూర్తిగా డిజిటల్ పద్ధతి ద్వారా చేపట్టడం జరుగుతుందని, మే 11వ తేదీ నుండి జూన్ 9వ తేదీ వరకు జనగణనలో భాగంగా ఇండ్ల గణన కార్యక్రమం కొనసాగుతుందని, కుటుంబాల వివరాలు పూర్తిగా నమోదు చేయబడతాయని, సన్నాహక పనులు మొదలు పెట్టాలని తెలిపారు. యాప్ నిర్వహణలో ఎటువంటి సాంకేతిక సమస్యలు తలెత్తినా వెంటనే పరిష్కరించి ప్రక్రియ సజావుగా సాగేలా అధికారులు కృషి చేయాలని తెలిపారు. చార్జెస్ (మండలాల) వారీగా ఎన్యుమరేటర్లు, సూపర్వైజర్ల నియామకం చేపట్టాలని, 300 ఇళ్లకు/750800 జనాభాకు ఒక ఎన్యుమరేటర్ ను నియమించాలని, ఎన్యుమరేటర్ బ్లాక్/ హౌస్ లిస్టింగ్ బ్లాక్ తయారు చేయాలని, క్షేత్రస్థాయిలో సమర్థవంతంగా విధులు నిర్వహించాలని తెలిపారు. జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ మాట్లాడుతూ జిల్లాలో జనగణన 2027 మొదటి విడతలో భాగంగా ఇండ్ల గణన విధులు అధికారులు, సిబ్బంది సమన్వయంతో సక్రమంగా నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. జిల్లాలో సుమారుగా 1 వేయి 899 మంది (10 శాతం అదనంతో కూడిన) ఎన్యుమరేటర్లు, సూపర్వైజర్లను నియమించడం జరుగుతుందని, ఎలాంటి పొరపాట్లకు తావు లేకుండా మొదటి విడత ఇండ్ల గణన ప్రక్రియను పూర్తి చేయడం జరుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ముఖ్య ప్రణాళిక అధికారి, జిల్లా జనగణన అధికారి పాపయ్య, ఉపగణాంక అధికారి, అదనపు జనగణన అధికారి రాజేందర్, మంచిర్యాల మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ జి.అన్వేష్, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# ప్రజావాణి దరఖాస్తులను వెంటనే పరిష్కరించాలి



**నిర్మల్, మార్చి 30, ప్రభాతవార్త:**

ప్రజావాణి దరఖాస్తులను ఎప్పటికప్పుడు పరిష్కరించాలని జిల్లా స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ వెంకటేశ్వర్లు అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో అదనపు కలెక్టర్ కిషోర్ కుమార్‌తో కలిసి పాల్గొన్నారు. ప్రజల నుంచి వచ్చిన ఫిర్యాదులను స్వయంగా స్వీకరించారు. ఈ సందర్భంగా మిగతా 2లో..



# విద్యార్థులు చదువుతోపాటు క్రీడల్లో రాణించాలి

● కలెక్టర్ హరిత

**ఆసిఫాబాద్, మార్చి 30, ప్రభాతవార్త**

విద్యార్థులు చదువుతోపాటు క్రీడల్లో రాణించాలని కలెక్టర్ హరిత అన్నారు. సోమవారం జిల్లా కేంద్రంలోని గిరిజన ఆదర్శ క్రీడా పాఠశాలలో నిర్వహిస్తున్న అశ్వీత జిల్లా స్థాయి అథ్లెటిక్ పోటీలలో గెలిచిన క్రీడాకారులకు బహుమతి ప్రధానోత్సవం కార్యక్రమంలో జిల్లా యువజన క్రీడల అధికారి అష్పాక్ అహ్మద్‌తో కలిసి మిగతా 2లో..

# బాలల సంరక్షణకు ప్రత్యేక చర్యలు

❖ మంచిర్యాల జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్

**నస్పూర్, మార్చి 30, ప్రభాతవార్త**

ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ప్రజా పలన ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా బాలల సంరక్షణకు ప్రత్యేక చర్యలు తీసుకోవడం జరుగుతుందని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. సోమవారం జిల్లాలోని నస్పూర్‌లో గల సమీకృత జిల్లా కార్యాలయాల భవన సముదాయంలోని కలెక్టర్ ఛాంబర్‌లో వివిధ శాఖల జిల్లా అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ 99 రోజుల ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా బాలల మిగతా 2లో..



## ఆన్‌లైన్ మట్కా నిర్వాహకుడు అరెస్ట్

### - రూ. 3 లక్షలకు పైగా నగదు, కారు, మొబైల్ ఫోన్లు స్వాధీనం

**కాగజ్‌నగర్, మార్చి 30, ప్రభాత వార్త:**



వివరాలు వెల్లడిస్తున్న టౌన్ ఇన్‌స్పెక్టర్ ప్రేమ్ కుమార్

కాగజ్‌నగర్ టౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలో ఆన్‌లైన్ మట్కా గేమ్ నిర్వహిస్తున్న వ్యక్తిని పోలీసులు సోమవారం అరెస్ట్ చేశారు. ఎన్‌టీఆర్ చౌక్ వద్ద రెడ్ హ్యాండెడ్‌గా పట్టుకున్నట్లు తెలిపారు. అరెస్ట్ అయిన నిందితుడు చౌదరి మహేష్ (30), వంకులం గ్రామం, రెబ్బెనా మండలం నివాసి కాగా ఇతను అమాయక ప్రజలను మోసం చేస్తూ ఆన్‌లైన్ మట్కా గేమ్ ద్వారా డబ్బులు సేకరిస్తున్నట్లు పోలీసులు గుర్తించారు. నిందితుడి వద్ద నుంచి రూ. 3,05,000 నగదు, రెండు మొబైల్ ఫోన్లు, స్విఫ్ట్ డిజైర్ కారు, వివిధ బ్యాంక్ కార్డులు స్వాధీనం చేసుకున్నారు. హెడ్ కానిస్టేబుల్ ఎం. సత్యనారాయణ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, ఎస్ఐ కె. రాజు దర్యాప్తు చేస్తున్నారని, ప్రజలు ఆన్‌లైన్ మోసాల పట్ల అప్రమత్తంగా ఉండాలని టౌన్ ఇన్‌స్పెక్టర్ ప్రేమ్ కుమార్ సూచించారు.

## ప్రజావాణి దరఖాస్తులను వెంటనే పరిష్కరించాలి

(మొదటిపేజీ తరువాయి)

ఆయన మాట్లాడుతూ ప్రతి దరఖాస్తును క్షుణ్ణంగా పరిశీలించి తక్షణమే స్పందించాలని సూచించారు. మండలాల వారీగా పెండింగ్‌లో ఉన్న సమస్యలను వెంటనే పరిష్కరించాలన్నారు. ప్రజల సమస్యల పరిష్కారానికి అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ప్రజలు విద్య, వైద్యం, ఇందిరమ్మ ఇళ్లు, పింఛన్లు, భూ సమస్యలపై దరఖాస్తులు సమర్పించారు. కార్యక్రమంలో ఆర్డీఓ రత్నకళ్యాణి, వివిధ శాఖల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

## బాలల సంరక్షణకు ప్రత్యేక చర్యలు

(మొదటిపేజీ తరువాయి)

సంరక్షణ కొరకు చర్యలు తీసుకోవడం జరుగుతుందని తెలిపారు. జిల్లాలో 6 చైల్డ్ కేర్ ఇన్స్టిట్యూషన్స్ ఉన్నాయని, జిల్లా పంచాయతీ అధికారి ఆధ్వర్యంలో గ్రామ బాలల పరిరక్షణ కమిటీలు ఏర్పాటు చేసి బలోపేతం చేయాలని, అనాథ పిల్లలను గుర్తించి వారిని తగిన వసతి గృహాలలో చేర్పించాలని తెలిపారు. కార్మిక శాఖ ఆధ్వర్యంలో బాల కార్మికులను గుర్తించి వారికి తగిన పారితోషకం ఇప్పించాలని, 14 సంవత్సరాల లోపు బాల బాలికలను పాఠశాలలలో చేర్పించాలని, ఇటుక బట్టీల దగ్గర ఉండే పిల్లలకు పని దగ్గర ప్రదేశాలలో పాఠశాలలు ఏర్పాటు చేయాలని తెలిపారు. అనాథ పిల్లలు, డ్రాప్ అవుట్ పిల్లలను గుర్తించి సంబంధిత శాఖల జిల్లా అధికారులతో కలిసి ఆయా వసతి గృహాలలో చేర్పించాలని, చైల్డ్ హెల్ప్ లైన్ కు అందే ఫిర్యాదులను ఎప్పటికప్పుడు పరిష్కరించే విధంగా అధికారులు సమన్వయంతో కృషి చేయాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా సంక్షేమ అధికారి రౌఫ్ ఖాన్, జిల్లా పంచాయతీ అధికారి వెంకటేశ్వరరావు, జిల్లా విద్యాధికారి ఎస్. యాదయ్య, జిల్లా మైనారిటీ సంక్షేమ శాఖ అధికారి నీరటి రాజేశ్వరి , అదనపు గిరిజన సంక్షేమ శాఖ అధికారి, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## అంగన్వాడీ కేంద్రాలకు ఒంటిపూట, మే నెల సెలవులు ఇవ్వాలి

### - ఖాళీగా ఉన్న టీచర్, ఆయా పోస్టులు భర్తీ చేయాలి

### - మినీ టీచర్ల పెండింగ్ వేతనం ఏరియర్స్‌తో సహా చెల్లించాలి

**లక్షెట్టిపేట, మార్చి 30, ప్రభాతవార్త**

అంగన్వాడీ యూనియన్ (సీఐటీయు) ఆధ్వర్యంలో సోమవారం రోజు అంగన్వాడీ కేంద్రాలకు ఒంటిపూట బడి, మే నెల సెలవులు ఇవ్వాలని ఐసిడిఎస్ ప్రాజెక్టు అధికారి సిడిపిఓకి వినతి పత్రం ఇవ్వడం జరిగింది. ఈ సందర్భంగా సీఐటీయు జిల్లా కార్యదర్శి దుంపల రంజిత్ కుమార్ మాట్లాడుతూ.. తెలంగాణ రాష్ట్రంలో ఎండలు మండిపోతున్నాయి. ఈ సందర్భంగా రాష్ట్ర కాంగ్రెస్ ప్రభుత్వం ప్రభుత్వ పాఠశాలలకు ఒంటిపూట బడి, మే నెల సెలవులు ఇచ్చింది. కానీ అంగన్వాడి కేంద్రాలకు వచ్చే పిల్లలు మూడు సంవత్సరాల నుంచి ఐదు సంవత్సరాలు వాళ్ళు వస్తారు. కాబట్టి ఎండ తీవ్రత వల్ల చిన్న పిల్లలను వారి తల్లితండ్రులు కూడా అంగన్వాడీ కేంద్రాలకు పంపించరు. అదేవిధంగా మినీ టీచర్లకు పెండింగ్లో ఉన్న మెయిన్ జీతం ఏరియర్స్ సహా చెల్లించాలి. ఖాళీగా ఉన్న టీచర్ ఆయా పోస్టులు భర్తీ చేయాలి. అంగన్వాడీ కేంద్రాలకు వచ్చే గ్యాస్ పంపిణీలో ఎలాంటి ఇబ్బందులు లేకుండా చూడాలన్నారు. ఇతర సమస్యలు పరిష్కరించాలన్నారు. ఈ కార్యక్రమంలో కనికారపు అశోక్ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి, గంధం రాజలింగం, వ్యకస జిల్లా ఉపాధ్యక్షులు, ప్రసన్న అంగన్వాడీ యూనియన్ జిల్లా కమిటీ సభ్యులు, అనసూయ, పద్మ, లక్ష్మి, సువర్ణ, స్వరూప, అంగన్వాడీ ఉద్యోగులు పాల్గొన్నారు.

# విద్యార్థులు చదువుతోపాటు క్రీడల్లో రాణించాలి

(మొదటిపేజీ తరువాయి)

పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ విద్యార్థులు క్రీడల్లో రాణించి జాతీయ స్థాయికి ఎదిగి జిల్లాకు మంచి పేరు తీసుకరావాలన్నారు. జిల్లాలో క్రీడాకారులకు కొదవ లేదని, సరైన శిక్షణ అందిస్తే జిల్లా క్రీడాకారులు జాతీయ, అంతర్జాతీయ స్థాయికి ఎదుగుతారని తెలిపారు. గిరిజన క్రీడాకారులు చాలా చురుకుగా ఉంటారని, శిక్షకులు వారికి సరైన శిక్షణను అందించాలన్నారు. ఈ సంవత్సరం హైదరాబాదులోని హాకిం పేట క్రీడా పాఠశాలలో జిల్లా నుండి ఎక్కువమంది ప్రవేశాలు పొందాలన్నారు. ఈ సందర్భంగా క్రీడాకారులకు మేమొంటోలు ప్రధానం చేశారు. ఈ కార్యక్రమంలో గిరిజన క్రీడల అధికారి మడావి శేఖు, పిజికల్ డైరెక్టర్లు, క్రీడా కారులు, విద్యార్థులు పాల్గొన్నారు.

### మన ఇసుక వాహనం ద్వారా పారదర్శకంగా ఇసుక సరఫరా..

మన ఇసుక వాహనం ద్వారా పారదర్శకంగా ఇసుక సరఫరా చేయడం జరుగుతుందని జిల్లా కలెక్టర్ కె హరిత అన్నారు. సోమవారం జిల్లా కేంద్రంలోని సమీకృత జిల్లా కలెక్టరేట్ భవన సమావేశ మందిరంలో నిర్వహించిన జిల్లా స్థాయి ఇసుక కమిటీ సమావేశానికి జిల్లా అదనపు కలెక్టర్ డేవిడ్, రాజస్వ మండల అధికారి, జిల్లా పంచాయతీ అధికారి బిక్షపతి, టిజిఎండిసి అధికారి వెంకటేశ్వర్లు, భూగర్భ గనుల శాఖ ఎడి గంగాధర్, భూగర్భ జల శాఖ ఎడి. సుహాసిని లతో కలిసి హాజరయ్యారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ప్రభుత్వం వినియోగదారులకు నిర్దేశిత ధరతో పారదర్శకంగా ఇసుక సరఫరా చేసేందుకు మన ఇసుక వాహనం యాప్ రూపొందించిందని, వినియోగదారులు ఈ యాప్ ద్వారా ఇసుక బుక్ చేసుకుని దళారుల జోక్యం లేకుండా ఇసుక పొందవచ్చని తెలిపారు. ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణాలకు ఉచిత ఇసుక అందించడం జరుగుతుందని తెలిపారు. సామాన్య ప్రజలకు పారదర్శకంగా, సులభంగా ఇసుకను అందుబాటులోకి తీసుకురావడమే ప్రభుత్వ లక్ష్యమని తెలిపారు. ప్రజలు తమ ఇసుక అవసరాల కోసం ప్రభుత్వం ప్రవేశపెట్టిన సబంధిత వెబ్‌సైట్ ద్వారా, జమన ఇసుక వాహనంచ మొబైల్ యాప్ ద్వారా మాత్రమే బుకింగ్ చేసుకోవాలని, జిల్లా పరిధిలో ఇసుక కావాలనుకునే వారు ట్రాక్టర్ 775 రూపాయలు చెల్లించి ఆన్ లైన్ ద్వారా పొందవచ్చని, ఇందిరమ్మ ఇళ్లకు ప్రత్యేక వెసులుబాటు కల్పించడం జరిగిందని తెలిపారు. ఏప్రిల్ 1 నుండి జిల్లాలో నూతన ఇసుక విధానం పూర్తిస్థాయిలో అమలు చేయడం జరుగుతుందని, ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా అన్ని ఏర్పాట్లు పూర్తి చేయాలని మైనింగ్ శాఖ అధికారులను ఆదేశించారు. జిల్లాలో ఇసుక అక్రమ రవాణాకు కఠిన చర్యలు తీసుకోవాలని, నిబంధనలు ఉల్లంఘించి ఇసుకను అక్రమంగా తరలిస్తే భారీ జరిమానాలు విధించడమే కాకుండా, చట్టపరమైన చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో సంబంధిత శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.



## బెల్లంపల్లిలో విద్యుత్ కార్మికుల ధర్నా

### - సమస్యల పరిష్కారానికి ప్రభుత్వంపై ఒత్తిడి

**బెల్లంపల్లి, మార్చి 30, ప్రభాతవార్త**

బెల్లంపల్లి పట్టణంలో విద్యుత్ శాఖ డివిజనల్ ఇంజనీర్ (డీఈ) కార్యాలయం ఎదుట విద్యుత్ కార్మికులు భారీ ధర్నా కార్యక్రమం నిర్వహించారు. తెలంగాణ విద్యుత్ ఆర్టిసన్, ఎంప్లాయిస్ జాయింట్ యాక్షన్ కమిటీ రాష్ట్ర పిలుపు మేరకు ఈ నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా సంఘ నాయకులు దేవేందర్, నవీన్, సుభాకర్, సింగారావు ఆనంద్ మాట్లాడుతూ విద్యుత్ సంస్థలో పనిచేస్తున్న ఆర్టిసన్, అనామ్యాన్డ్, పీస్ రేటెడ్ కార్మికుల సమస్యలను రాష్ట్ర ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేశారు. వారి ప్రధాన డిమాండ్లు ఇలా ఉన్నాయి. విద్యా అర్హతల ఆధారంగా ఆర్టిసన్ ఉద్యోగుల కన్వర్షన్ చేయాలి. ఏపీఎస్ఈబీ సర్వీస్ రూల్స్ అమలు చేయాలి. పీస్ రేటెడ్, ఆర్టిసన్ కార్మికులకు ప్రస్తుత ఓ అండ్ ఎం సర్వీస్ రూల్స్ వర్తింపజేయాలి. టీజీఎన్‌పీడీసీఎల్, టీజీఎస్పీడీసీఎల్ సంస్థల్లో అన్మాన్డ్ వర్కర్లను ఆర్టిసన్‌లుగా విలీనం చేయాలి. డిసెంబర్ 4, 2016కు ముందు పని చేస్తున్న ఔట్‌సోర్సింగ్ కార్మికులను విద్యుత్ ఉద్యోగులుగా గుర్తించాలి. జీవో ఎంఎస్ నెంబర్ 11 ప్రకారం కనీస వేతనాలు చెల్లించాలి. ప్రభుత్వం ఈ నెల 7వ తేదీలోగా సమస్యలను పరిష్కరించకపోతే, 8వ తేదీ నుంచి రాష్ట్రవ్యాప్తంగా సమ్మె చేపడతామని హెచ్చరించారు. ఈ సమ్మెలో విద్యుత్ ఉద్యోగులంతా పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ ధర్నాకు పలు కార్మిక సంఘాలు మద్దతు ప్రకటించాయి. టీవీకేఎస్‌హెచ్58 సంఘం నాయకులు ముష్క నర్సయ్య, జాల తిరుపతి, పైడాకుల తిరుపతి పాల్గొని సంఘీభావం తెలిపారు. అదేవిధంగా తెలంగాణ ఎలక్ట్రిసిటీ ఎంప్లాయిస్ యూనియన్ నాయకులు గిట్టె పుండాలిక్ రావు, మార్కొండయ, పెద్ద రమేష్, యూసఫ్, ఈశ్వర్ తదితరులు కూడా మద్దతు ప్రకటించారు. విద్యుత్ కార్మికుల సమస్యలపై రాష్ట్ర ముఖ్యమంత్రి వెంటనే స్పందించాలని, రానున్న రాష్ట్ర వ్యాప్త సమ్మెను విజయవంతం చేయాలని నాయకులు పిలుపునిచ్చారు.

## పెండింగ్ బిల్లులు, అకౌంటింగ్ పనులు వెంటనే పూర్తి చేయాలి

### - శ్రీరాంపూర్ ఏరియా జీఎం మునిగంటి శ్రీనివాస్

### - ఏరియా ఫైనాన్స్ విభాగంపై సమీక్ష

**నస్పూర్, మార్చి 30, ప్రభాతవార్త**

ప్రస్తుత ఆర్థిక సంవత్సరానికి సంబంధించిన పెండింగ్ బిల్లులు, అకౌంటింగ్ పనులు మార్చి 31లోగా పూర్తి చేయాలని శ్రీరాంపూర్ ఏరియా జీఎం మునిగంటి శ్రీనివాస్ ఆదేశించారు. సోమవారం ఏరియా జీఎం కార్యాలయంలోని కాన్ఫరెన్స్ హాల్‌లో నిర్వహించిన ఫైనాన్స్ సమీక్షా సమావేశానికి ఆయన అధ్యక్షత వహించారు. ఈ నెల చివరి నాటికి చేపట్టిన పనుల బిల్లులు, క్యాపిటల్ వర్కింగ్ ప్రోగ్రెస్ నివేదికలను సిద్ధం చేయాలని అన్ని గనులు, విభాగాల అధికారులకు సూచించారు. ఈ ఆర్థిక సంవత్సరంలో జరిగిన ఆర్థిక లావాదేవీల వివరాలను ఏజీఎం ఫైనాన్స్ సుమలత పీపీటీ ద్వారా వివరించారు. పూర్తయిన కాంట్రాక్టుల సెక్యూరిటీ డిపాజిట్ల మంజూరు, మూతపడిన గనుల ఆస్తులు, యంత్రాల తరలింపు అంశాలపై చర్చించారు. టెండర్లకు సంబంధించిన పనితీరు నివేదికలను త్వరగా సమర్పించాలని జీఎం కోరారు. వచ్చే ఆర్థిక సంవత్సరానికి అవసరమైన బడ్జెట్ ప్రణాళికలతో సిద్ధంగా ఉండాలని అధికారులకు దిశానిర్దేశం చేశారు. ఈ సమావేశంలో ఎస్ఓ టు జీఎం సత్యనారాయణ, ఏజీఎం (ఫైనాన్స్) సుమలత, ఏరియా ఇంజనీర్ రమణారావు, శ్రీరాంపూర్ ఏరియా అధికారుల సంఘం అధ్యక్షుడు వెంకటేశ్వర్ రెడ్డి, వివిధ గ్రూపుల ఏజెంట్లు, ఎస్టేట్స్ మేనేజర్ వరలక్ష్మి, గనుల మేనేజర్లు, సీనియర్ పీఓ సురేందర్, డిప్యూటీ ఫైనాన్స్ మేనేజర్ నరేష్, సీనియర్ అకౌంట్స్ ఆఫీసర్ సందీప్, ఫైనాన్స్ విభాగం అధికారులు పాల్గొన్నారు.



# ఇందిరమ్మ కాలనీలో సబ్ కలెక్టర్ పర్యటన

### అర్హులైన లబ్ధిదారులకు ఇళ్లు మంజూరు చేయాలి - అన్ని సౌకర్యాలు కల్పించి న్యాయం చేయాలి

**తాండూర్, మార్చి 30, ప్రభాతవార్త :**

మండలంలోని కొత్తపల్లి పంచాయతీ పరిధిలోని ఇందిరమ్మ కాలనీలో సోమవారం బెల్లంపల్లి సబ్ కలెక్టర్ మనోజ్ కుమార్ పర్యటించారు. సబ్ కలెక్టర్ ఇందిరమ్మ కాలనీలో విస్తృతంగా పర్యటించి నాయకులను, ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులను సమస్యలు అడిగి తెలుసుకున్నారు. 2007 సంవత్సరంలో అప్పటి వైయస్ రాజశేఖర్ రెడ్డి ప్రభుత్వం హాయంలో రెవెన్యూ అధికారులు ఇండ్ల పట్టాలు ఇచ్చారన్నారు. రోడ్లు, విద్యుత్, మంచినీటి సౌకర్యం లేకపోవడంతో పక్కా ఇళ్లు నిర్మించుకోలేదన్నారు. ఇందిరమ్మ కాలనీలో కొందరు లబ్ధిదారులు ఇళ్లు నిర్మించుకుని నివాసం ఉంటున్నప్పటికీ విద్యుత్, మంచినీటి, రోడ్ల సౌకర్యం కల్పించలేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైన సీఎం రేవంత్ రెడ్డి, ఉన్నత అధికారుల దృష్టికి తీసుకెళ్లి అర్హులైన పేదలకు ఇందిరమ్మ ఇండ్లు మంజూరు చేసి, ఇందిరమ్మ కాలనీలో విద్యుత్, రోడ్లు, మంచినీటి సౌకర్యం కల్పించి న్యాయం చేయాలని సబ్ కలెక్టర్ కు పలువురు లబ్ధిదారులు మొర పెట్టుకున్నారు. సబ్ కలెక్టర్ స్పందించి క్షేత్రస్థాయి పరిశీలన అనంతరం పూర్తి నివేదికను ఉన్నతాధికారులకు పంపిస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో సర్పంచ్ ఆకుల వెంకటేష్, మాజీ ఎంపీపీ సిరంగి శంకర్, తహశీల్దార్ జ్యోత్స్న, ఎంపిడివో శ్రీనివాస్, విద్యుత్ ఏఈ జాన్, ఆర్ఐ ఏజజోద్దీన్, కార్యదర్శి లక్ష్మణ్, నాయకులు, లబ్ధిదారులు పాల్గొన్నారు.

# నేడు కొత్తపల్లి వారసంత వేలంపాట

**తాండూర్, మార్చి 30, ప్రభాతవార్త :**

మండలంలోని ఐ.బి. సమీపంలో ప్రతి బుధవారం నిర్వహించే తాండూర్ వారసంత 2026 27 ఆర్థిక సంవత్సరం నిర్వహణ కోసం బహిరంగ వేలంపాట నిర్వహిస్తున్నట్లు సర్పంచ్ ముడిమడుగుల సురేష్, కార్యదర్శి దివాకర్ తెలిపారు. ఈనెల 31న ఉదయం 10.30 గంటలకు వారసంత ఆవరణలో వేలంపాట జరుగుతుందన్నారు. ఆసక్తి గల కాంట్రాక్టర్లు కూరగాయల మార్కెట్ కు రూ.10 వేలు సకాలంలో డిపాజిట్ చెల్లించి వేలం పాటలో పాల్గొనాలని వారు కోరారు.



సీసీ రోడ్డు నిర్మాణ పనులను ప్రారంభించిన రవికుమార్ రవికుమార్

# సీసీ రోడ్డు పనులకు భూమి పూజ

**తాండూర్, మార్చి 30, ప్రభాతవార్త :**

మండలంలోని మాదారం త్రీ ఇంక్లైన్ గ్రామంలో సోమవారం సిసి రోడ్డు నిర్మాణ పనులకు సర్పంచ్ చందనాల రవికుమార్ భూమి పూజ చేసి ప్రారంభించారు ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సింగరేణి మెయిన్ రోడ్డు నుంచి సత్తిరెడ్డి ఇంటి వరకు రూ.4లక్షలు ఉపాధి హామీ పథకం ద్వారా సీసీ రోడ్డు పనులు నిర్మిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీపీ సిరంగి శంకర్, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు ఎండి ఈసా, ఉపసర్పంచ్ చింతపురి మల్లేశ్వరి, వార్డు సభ్యులు కుర్సెంగ తిరుపతి, చందనాల లత, వాసాల అనిల్ కుమార్, గొర్లపల్లి కమలాకర్, ఈ సాయిలత, గ్రామస్తులు, తదితరులు పాల్గొన్నారు.



పనులను ప్రారంభించిన సర్పంచ్ లక్ష్మీనారాయణ, ఉపసర్పంచ్ దామోదర్‌రెడ్డి

# మంచినీటి పైప్ లైన్ పనులు ప్రారంభం

**తాండూర్, మార్చి 30, ప్రభాతవార్త :**

మాదారం గ్రామపంచాయతీ లోని పోచంపల్లి గ్రామంలో నూతన మంచినీటి పైప్ లైన్ పనులను సోమవారం సర్పంచ్ కుశనపల్లి లక్ష్మీనారాయణ, ఉప సర్పంచ్ దామోదర్ రెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ ఓవర్ హెడ్ మంచినీటి ట్యాంక్ నుండి గ్రామంలోని ప్రతి ఇంటికి మంచినీటినీ సరఫరా చేయడం కోసం నూతన పైప్ లైన్ నిర్మిస్తున్నామన్నారు. కార్యక్రమంలో వార్డు సభ్యులు గొర్లపల్లి బాణేష్, ఎంపీఓ అనిల్ కుమార్, పంచాయతీ కార్యదర్శి అల్లావుద్దీన్, ప్రజలు పాల్గొన్నారు.

# వాంకిడి కాంగ్రెస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్‌గా దీకొండ మహేష్

**వాంకిడి, ప్రభాతవార్త**



వాంకిడి మండల కాంగ్రెస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్‌గా బంబర గ్రామానికి చెందిన దీకొండ మహేష్ నియమితులయ్యారు ఆయనను నియమిస్తూ కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షురాలు సుగుణక్క ఉత్తర్వులు జారీ చేశారు, కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి పాటు పడుతున్న మహేష్ కు పదవి రావడం వల్ల ఆయన అనుచరులు స్వీట్లు పంపిణీ చేశారు, ఈ సందర్భంగా మహేష్ మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం అన్ని వర్గాల సంక్షేమానికి కృషి చేస్తుందన్నారు, తనకు పదవి రావడానికి కృషిచేసిన మండల అధ్యక్షులు గురనులే నారాయణకు కృతజ్ఞతలు తెలిపారు.

# ప్రజావాణి సమస్యల పరిష్కారానికి అధికారులు సమన్వయంతో కృషి చేయాలి

## మంచిర్యాల జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్

**నస్పూర్, మార్చి 30, ప్రభాతవార్త**

ప్రజావాణి కార్యక్రమంలో అందిన దరఖాస్తులను క్షేత్రస్థాయిలో పరిశీలించి త్వరగా పరిష్కరించే విధంగా చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. సోమవారం జిల్లాలోని నస్పూర్‌లో గల సమీకృత జిల్లా కార్యాలయాల భవన సమావేశ మందిరంలో జిల్లా అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) పి. చంద్రయ్య, జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) శ్రీనివాస్ రావు లతో కలిసి అర్జీదారుల నుండి దరఖాస్తులు స్వీకరించారు. చెన్నూర్ పట్టణానికి చెందిన దాసరి ప్రవీణ్ కుమార్, దాసరి రమేష్ లు తమ తాతల నుండి వస్తున్న పట్టా భూమిని నిషేధిత భూముల జాబితాలో చేర్చారని, ఈ పొరపాటును సవరించి తనకు పట్టా పాసు పుస్తకం మంజూరు చేయాలని కోరుతూ వేరువేరుగా దరఖాస్తులు అందజేశారు. కిష్టంపేట గ్రామస్తులు తమ దరఖాస్తులో నిజామాబాద్ నుండి జగదల్పూర్ జాతీయ రహదారి 63 లోని కిష్టంపేట, భీమారం మధ్యలో ఉన్న జోడు వాగులపై నూతన వంతెన నిర్మించాలని కోరారు. బెల్లంపల్లి మండలం బట్వాన్ పల్లి గ్రామానికి చెందిన శ్రీనివాస్ తనకు గిఫ్ట్ దస్తావేజు, న్యాయస్థానం డిక్రీ ద్వారా సంక్రమించిన భూమి పట్టాను కొందరు అక్రమంగా రద్దు చేయాలని ప్రయత్నిస్తున్నారని, ఈ విషయమై తనకు న్యాయం చేయాలని కోరుతూ దరఖాస్తు అందజేశారు. మంచిర్యాల పట్టణం అశోక్ రోడ్డు కు చెందిన పాలకుర్తి రమాదేవి తన భర్త పేరిట గల భూమిని



ఆయన మరణించినందున తన పేరిట విరాసత్ చేసి పట్టా పాసు పుస్తకం మంజూరు చేయాలని కోరుతూ అర్జీ సమర్పించారు.

వేమనపల్లి మండలం నాగారం గ్రామ మాజీ సర్పంచ్ తలండి స్వరూపారాణి తాను అధికారంలో ఉన్నప్పుడు చేసిన ఖర్చులకు సంబంధించి బిల్లులు ఇప్పించాలని కోరుతూ దరఖాస్తు అందజేశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ప్రజావాణి కార్యక్రమంలో అందిన దరఖాస్తులను క్షేత్రస్థాయిలో పరిశీలించి సంబంధిత అధికారుల సమన్వయంతో త్వరితగతిన పూర్తి చేసే విధంగా చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.



# ప్రజావాణి దరఖాస్తులు త్వరగా పరిష్కరించాలి

## - ఐటీడీఏ పివో యువరాజ్ మార్మాట్

**ఉట్నూర్, మార్చి 30,ప్రభాతవార్త :**

ప్రతీ సోమవారం ప్రజావాణికార్యక్రమంలో అందిన దరఖాస్తులపై క్షేత్రస్థాయి లో పరిశీలించి త్వరగా పరిష్కరించే విధంగా అధికారులు సమన్వయంతో చర్యలు తీసుకోవాలని ఉట్నూర్ ఐటీడీఏ పివో యువరాజ్ మార్మాట్ అన్నారు. సోమవారం కార్యాలయం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో వివిధ సమస్యలపై ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు. బెజ్జూర్ మండలం కుకూడా గ్రామానికి చెందిన సత్తయ్య తనకి అటవీ హక్కు పత్రం మంజూరు కల్పించామని, ఉట్నూర్ మండలం లక్సటిపేట గ్రామానికి చెందిన తొడసం మారుతీ తన వ్యవసాయ క్షేత్రానికి బోర్ వెల్ మంజూరు కొరకు అర్జీ కోరారు. బీంపూర్ మండలం భీమ్ పూర్ గ్రామానికి చెందిన గ్రామస్తులు తమ గ్రామ ప్రజలకి గొర్రెల లోన్ కల్పించామని అర్జీ కోరారు,వివిధ ప్రాంతానుండి వచ్చిన ప్రజలు పింఛన్, ఇందిరమ్మ ఇళ్లు, రైతు భరోసా, స్వయం ఉపాధి పథకాల మం జూరు, వ్యవసాయ, రెవెన్యూ శాఖలకు సంబంధిం చిన సమస్యలు పరిష్కరించాలని దరఖాస్తులు అందజేశారు. ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

# ఇందిరమ్మ ఇళ్ల పనులు వేగవంతం చేయాలి: ఎంపిడిఓ ఆల్బర్ట్

**పెంచికల్‌పేట్, మార్చి 30, ప్రభాతవార్త :**



మండల పరిధిలోని ఎల్కపల్లి, ఎల్లూర్ గ్రామ పంచాయతీలలో నిర్మాణంలో ఉన్నా ఇందిరమ్మ ఇళ్లను ఎంపిడిఓ ఆల్బర్ట్ సోమవారం పరిశీలించారు. నిర్మాణ పనుల పురోగతిని ప్రత్యేక్షంగా తనిఖీ చేసి, పనులను వేగవంతం చేసి త్వరితగతిన పూర్తి చేయాలని లబ్ధిదారులకు సూచించారు. ఇళ్ల నిర్మాణంలో నాణ్యత ప్రమాణాలు పాటించాల్సి న అవసరాన్ని ఆయన ప్రత్యేకంగా పేర్కొన్నారు. ప్రభుత్వం అందిస్తున్న సదుపాయాలను సద్వినియోగం చేసుకుని ఇళ్ల నిర్మాణం ఆలస్యం చేయకుండా పూర్తి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎల్కపల్లి సర్పంచ్ రాంచందర్, ఎల్లూర్ సర్పంచ్ చప్పిడి రవీందర్, లబ్ధిదారులు, తదితరులు పాల్గొన్నారు.

# రోడ్డు మరమ్మతులు చేయించిన కౌన్సిలర్

**లక్షెట్టిపేట, మార్చి 30, ప్రభాతవార్త**

లక్షెట్టిపేట మున్సిపాలిటీ పరిధిలోని 13వ వార్డులో రోడ్డు మధ్యలో ఏర్పడిన గ్యాప్‌ను కౌన్సిలర్ బిరుదుల సత్యనారాయణ మరమ్మతులు చేయించారు. రోడ్డు మధ్యలో గ్యాప్ రావడంతో వాహనదారులు, ప్రజలు తీవ్ర ఇబ్బంది పడుతున్నారు. ఈ విషయం తెలుసుకున్న కౌన్సిలర్ సోమవారం ఉదయం రోడ్డు మధ్యలో ఏర్పడిన గ్యాప్ ను మున్సిపల్ కార్మికులకు సహాయంతో చేయించారు.



# వేదిక్ గణితం పుస్తకావిష్కరణ

**దండేపల్లి మార్చి 30 ప్రభాతవార్త**

మండలంలోని ద్వారక ప్రాథమిక పాఠశాలలో ప్రధానోపాధ్యాయుడు గా పనిచేస్తున్న నీరటి సురేష్ వేదిక్ గణితం పుస్తకాన్ని రచించారు. సోమవారం స్థానిక పాఠశాలలో మండల విద్యాధికారి రాజు వేదిక్ గణిత పుస్తకాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎంఇఓ మంత్రి రాజు మాట్లాడుతూ, పురాతన భారతీయ గణిత పద్ధతుల ద్వారా విద్యార్థులు తక్కువ సమయంలో ఖచ్చితత్వముతో లెక్కలు చేయడం నేర్చుకుంటరాని అన్నారు. ఈ పద్ధతుల వల్ల విద్యార్థుల్లో గణితం పట్ల ఉన్న భయాన్ని పోగొట్టి వారిలో ఏకాగ్రతను సృజనాత్మకతను పెంచుతాయి అని అన్నారు. అనంతరం జిల్లా పరిషత్ సెకండరీ పాఠశాల ద్వారక ప్రధాన ఉపాధ్యాయుడు నర్సయ్య మాట్లాడుతూ, నేటి ప్రపంచంలో విద్యార్థులు గణితం వేగం ఖచ్చితత్వం కలిగి ఉండటం చాలా అవసరం అని అన్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థిని విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.



# ప్రజావాణి దరఖాస్తులను సత్వరమే పరిష్కరించాలి

**ఆసిఫాబాద్, మార్చి 30, ప్రభాతవార్త :**

ప్రజావాణిలో వచ్చే ధరఖాస్తులను సత్వరమే పరిష్కారమయ్యే విధంగా అధికారులు చర్యలు తీసుకోవాలని కలెక్టర్ అన్నారు. సోమవారం సమీకృత కలెక్టరేట్ భవన సముదాయంలోని సమావేశ మందిరంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమానికి అదనపు కలెక్టర్ ఎం. డేవిడ్, ఆసిఫాబాద్ రాజస్వ మండల అధికారి లోకేశ్వర్ రావుతో కలిసి కలెక్టర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ వివిధ సమస్యలపై వచ్చే ధరఖాస్తులను క్షేత్రస్థాయిలో పరిశీలించి సత్వరమే పరిష్కరించాలని, పత్రికలలో వచ్చే ప్రతికూల వార్తలపై వెంటనే స్పందించి చర్యలు తీసుకోవాలన్నారు. అనంతరం అర్జీదారుల నుంచి అర్జీలు స్వీకరించారు. తిర్యాని మండలం ఎదులపాడ్ గ్రామ సర్పంచ్ మాడావి పార్వతి తమ గ్రామ పంచాయతీ పరిధిలోని చిన్న అరటిపల్లి గ్రామంలో అంగన్వాడి భవనం నిర్మాణం చేపట్టాలని, ఆసిఫాబాద్ పట్టణం జన్కాపూర్ ఆర్ఎస్ఆర్ కాలనీకి చెందిన సేండే మోతిరాం తనకు వస్తున్న పింఛను జన్కాపూర్ కు బదిలీ చేయాలని, తిర్యాని మండలం మొర్రి



అర్జీదారులతో మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్ హరిత

గూడ గ్రామానికి చెందిన కట్కక హనుమంతరావు తనకు దివ్యాంగుల పింఛను మంజూరు చేయాలని, కాగజ్ నగర్ పట్టణం విజయనగర్ కాలనీకి చెందిన మహమ్మద్ ఖాజా తనకు వస్తున్న పింఛను నిలుపుదల అయినందున పున:రుద్ధరించాలని, మంచిర్యాల జిల్లా కేంద్రానికి చెందిన గడిగోపుల మాన్విత్ తన తండ్రి ఉద్యోగం చేస్తూ మరణించినందున తనకు కారణ్య నియామకం కింద ఉద్యోగం ఇప్పించాలని, కౌటాల మండలం బాదంపల్లి గ్రామానికి చెందిన కుమ్మరి సంస్కృుతి, తాను కాన్పూర్ ఐ.ఐ.టీ లో ప్రథమ సంవత్సరం విద్యను అభ్యసిస్తున్నందున లాప్టాప్ మంజూరు చేయించాలని, రెబ్బెన మండలం తక్కలపల్లి గ్రామానికి చెందిన టేకం బుజంగ్ రావు తనకు జారీ చేసిన భూమి పట్టా బుక్కులో ఒక ఎకరం భూమి తక్కువగా నమోదైనందున సవరణ చేయాలని పలువురు దరఖాస్తులు అందజేశారు. ఈ ప్రజావాణిలో అధికారులు, ధరఖాస్తు దారులు పాల్గొన్నారు.



పి ఓ యువరాజ్ మర్మాట్‌కు ఆహ్వానిస్తున్న కమిటీ సభ్యులు

## మహాఛండీ యాగానికి పిఓ కు ఆహ్వానం

**ఉట్నూర్, మార్చి 30,ప్రభాతవార్త :**

ఉట్నూర్ రామాలయంలో నిర్వహిస్తున్న శ్రీ ఆయుత మహాచండీ యాగానికి రావాలని ఐటీడీఏ ప్రాజెక్ట్ అధికారి యువరాజ్ మర్మట్‌ను నిర్వాహకులు ఆహ్వానించారు. సోమవారం పీఓను కలిసి ఆహ్వాన పత్రికను అందజేశారు. ఏప్రిల్ 1న జరగనున్న చండీయాగ మహా పూజకు రావాలని కోరగా ఆయన సానుకూలంగా స్పందించినట్లు నిర్వాహకులు కృష్ణస్వామి తెలిపారు. ఈ కార్యక్రమంలో యాగ కమిటీ సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.



పరీక్ష నిర్వహణను పరిశీలిస్తున్న ఎంఈఓ వాసాల ప్రభాకర్

## మండలంలో ఫౌండేషన్ లర్నింగ్ స్టడీ పరీక్షల నిర్వహణ

**కాగజ్‌నగర్ రూరల్, మార్చి 30, ప్రభాతవార్త :**

కాగజ్‌నగర్ మండలంలోని మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలైన కోసిని, రాస్పెల్లి, ఆరిగూడ పాఠశాలల్లో మూడవ తరగతి విద్యార్థుల అభ్యసన సామర్థ్యాలను అంచనా వేయడానికి నేషనల్ అచీవ్మెంట్ సర్వే సంస్థ ఆధ్వర్యంలో ఫౌండేషన్ లర్నింగ్ స్టడీ (ఎఫ్ఎల్ఎస్) పరీక్షలను నిర్వహించారు. ఈ పరీక్షల్లో ఎంపీపీఎస్ కోసినిలో 8 మంది విద్యార్థులు, రాస్పెల్లిలో 6 మంది, ఆరిగూడలో 18 మంది విద్యార్థులు పాల్గొనగా, మొత్తం 32 మంది విద్యార్థులు హాజరయ్యారు. ఈ సందర్భంగా మండల విద్యాధికారి వాసాల ప్రభాకర్ మాట్లాడుతూ ఈ పరీక్షల్లో ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులకు ముఖ్యమంత్రి చేతుల మీదుగా ప్రశంసా పత్రాలు అందజేయనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయురాలు ఆత్రం ప్రమీల, పాఠశాల ప్రధానోపాధ్యాయులు బడుగు సదానందం, ఉపాధ్యాయులు రజిత, శారద, ఫీల్డ్ ఇన్స్పెక్టర్ అంజలి పాల్గొన్నారు.

## చెత్త శుద్ధి కేంద్రాన్ని పరిశీలించిన డైట్ విద్యార్థులు

**సారంగాపూర్, మార్చి 30, ప్రభాతవార్త:**

మండల కేంద్రంలోని చెత్త శుద్ధి కేంద్రాన్ని సోమవారం డైట్ కళాశాల విద్యార్థులు, ఎస్బీఐ అధికారి మధుమిత పరిశీలించారు. క్షేత్రస్థాయి పర్యటనకు విచ్చేసిన విద్యార్థులకు పంచాయతీ కార్యదర్శి కృష్ణ తడి, పొడి చెత్త సేకరణ, వాటిని వేరు చేసి సేంద్రియ ఎరువును తయారు చేసే విధానాన్ని వివరించారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక గురించి వారికి తెలిపారు. గ్రామంలో సేకరించిన చెత్తతో ఎరువు తయారీపై విద్యార్థులు అవగాహన పెంపొందించుకున్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ లక్ష్మికాంత్, ఎంపీఓ అజీజ్ ఖాన్, కళాశాల ప్రిన్సిపాల్ పంచశీల, స్థానిక సర్పంచ్ కోనేరు భూమన్న, యాకర్పల్లి సర్పంచ్ దివ్య, ఉప సర్పంచ్ కృష్ణ, క్లస్టర్ కార్యదర్శులు పాల్గొన్నారు.



షెడ్డును పరిశీలిస్తున్న విద్యార్థులు

## బీఆర్ఎస్ నాయకుల ముందస్తు అరెస్టు

**సారంగాపూర్, మార్చి 30, ప్రభాతవార్త:**

సారంగాపూర్ మండలంలోని బీఆర్ఎస్ నాయకులను ఏఎస్ఐ వసంత్ ముందస్తుగా అరెస్టు చేశారు. ఆదివారం బీఆర్ఎస్ శాసనసభ్యులను స్పీకర్ సస్పెండ్ చేసిన నేపథ్యంలో, స్థానిక నాయకులు ధర్నా నిర్వహిస్తారన్న సమాచారంతో పోలీసులు ఈ చర్య తీసుకున్నారు. మండల కన్వీనర్ దేవి శంకర్, లక్ష్మినారాయణ గౌడ్, రమేష్ రెడ్డి, సతీష్ గౌడ్, మోతేవార్ కిషన్, అంజయ్య తదితరులను అదుపులోకి తీసుకుని పోలీస్ స్టేషన్‌కు తరలించారు. శాంతిభద్రతల పరిరక్షణలో భాగంగానే ఈ ముందస్తు అరెస్టులు చేసినట్లు పోలీసులు తెలిపారు.



బీఆర్ఎస్ నాయకులను అదుపులోకి తీసుకున్న పోలీసులు

## జాం గ్రామంలో గ్రామసభ

**సారంగాపూర్, మార్చి 30, ప్రభాతవార్త:**

సారంగాపూర్ మండలంలోని జాం గ్రామంలో సోమవారం సర్పంచ్ కరిపే రవళి అధ్యక్షతన గ్రామసభ నిర్వహించారు. ఈ సభలో పలు అభివృద్ధి కార్యక్రమాలకు సంబంధించిన అంశాలను తీర్మానం చేశారు. ప్రజల వద్దకు పాలన, మార్నింగ్ వాక్ చేపట్టి ప్రజా సమస్యల పరిష్కారం దిశగా గ్రామ పంచాయతీ తీర్మానించింది. ప్రజా పాలన ప్రగతి ప్రణాళికలోని అంశాలపై చేపట్టే పనుల గురించి చర్చించారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ సెక్రటరీ అశోక్, ఉపసర్పంచ్ గంగాధర్, వార్డు సభ్యులు, ఆయా శాఖల అధికారులు పాల్గొన్నారు.






విద్యుత్ అర్జీన్ ఎంప్లాయిస్ జేఏసీ ఆధ్వర్యంలో ధర్నా

## విద్యుత్ బిల్లు ఆపరేటర్ కార్మికుల సమస్యలను పరిష్కరించాలి

**ఉట్నూర్, మార్చి 30,ప్రభాత వార్త :**

విద్యుత్ అప్రేటర్ బిల్లు కార్మికుల సమస్యలు పరిష్కరించాలని జేఏసీ చైర్మన్ రాథోడ్ సంజీవ్ అన్నారు. సోమవారం పట్టణంలో కార్మికుల ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. అయన మాట్లాడుతూ జిల్లా లో ఉన్న విద్యుత్ శాఖ కార్మికుల సమస్యలు పరిష్కారం చేయాలన్నారు. ఈ ధర్నా కార్మికులు పాల్గొన్నారు.

## వార్షిక బొగ్గు ఉత్పత్తి లక్ష్యాన్ని సాధించిన బెల్లంపల్లి ఏరియా

### - జీఎం విజయభాస్కర్ రెడ్డి

**తాండూర్, మార్చి 30, ప్రభాతవార్త**

అధికారుల మార్గనిర్దేశం, ఉద్యోగుల సమష్టి కృషి మూలంగా వార్షిక లక్ష్యాన్ని బెల్లంపల్లి ఏరియా లక్ష్యాన్ని సాధించిందని బెల్లంపల్లి ఏరియా జీఎం విజయ భాస్కర్ రెడ్డి అన్నారు. ఖైరిగుర ఉపరితల గని వద్ద సోమవారం ఏరియా అధికారులు, పర్యవేక్షకులతో జీఎం సమావేశం నిర్వహించారు. జీఎం మాట్లాడుతూ బెల్లంపల్లి ఏరియాకు 202526 వార్షిక లక్ష్యం 35 లక్షల టన్నులు కాగా 35.14 లక్షల టన్నుల ఉత్పత్తి రవాణా సాధించడం జరిగింది. వార్షిక లక్ష్యం రెండు రోజులు ముందే అధిగమించడంతో ఖైరిగుర ఓసి, సిహెచ్పి లక్ష్య సాధనకు కృషి చేసిన అధికారులకు, కార్మికులకు జీఎం కృతజ్ఞతలు తెలిపారు. మరోవైపు ఖైరిగుర ఓసి ఈనెల 29న ఒక్క రోజే 26,426 టన్నుల బొగ్గు ఉత్పత్తి, రవాణా చేసి గత రికార్డులను అధిగమించి సరికొత్త రికార్డు సాధించిందన్నారు. ఈ సమావేశంలో ఖైరిగుర ప్రాజెక్టు అధికారి మచ్చగిరి నరేందర్, ఏరియా ఇంజినీర్ కృష్ణమూర్తి, ప్రాజెక్ట్ ఇంజినీర్ వీరన్న, మేనేజర్ శంకర్ అన్ని విభాగాల అధిపతులు, పర్యవేక్షకులు, అధికారులు తదితరులు పాల్గొన్నారు.



వార్షిక లక్ష్యాన్ని సాధించిన సందర్భంగా ఆనందం వ్యక్తం చేస్తున్న జీఎం, అధికారులు



సన్మానిస్తున్న ప్రిన్సిపాల్

## ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో పారిశ్రామికవేత్తల మార్గదర్శనం

**భైంసా, మార్చి 30, ప్రభాతవార్త:**

భైంసా ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో విద్యార్థుల కోసం నిర్వహించిన ప్రత్యేక అతిథి ఉపన్యాస కార్యక్రమం విజయవంతమైంది. తెలంగాణ స్టేట్ ఫైనాన్స్ కార్పొరేషన్ సీనియర్ బ్రాంచ్ మేనేజర్, పారిశ్రామిక నిపుణుడు మహమ్మద్ అబ్దుల్ అలీమ్ ముఖ్య అతిథిగా హాజరై విద్యార్థులకు మార్గదర్శనం చేశారు. పారిశ్రామిక రుణాలు పొందే విధానం, వ్యాపార అభివృద్ధికి అవసరమైన ఆర్థిక ప్రణాళికలు, రిస్క్ మేనేజ్‌మెంట్ వంటి కీలక అంశాలపై ఆయన అవగాహన కల్పించారు. ప్లేస్‌మెంట్ కోఆర్డినేటర్ నహీదా తబస్సుమ్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ కర్రోల్ల బుచ్చయ్య, అధ్యాపకులు కలిసి అతిథిని ఘనంగా సన్మానించారు. విద్యార్థులు తమ సందేహాలను అడిగి నివృత్తి చేసుకున్నారు. భవిష్యత్తులో వ్యాపార రంగంలో రాణించేందుకు అవసరమైన ఆచరణాత్మక జ్ఞానాన్ని ఈ కార్యక్రమం ద్వారా అందించారు.



చెక్కులు అందజేస్తున్న దశరథ్ రాజేశ్వర్

## సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కుల పంపిణీ

**సారంగాపూర్, మార్చి 30, ప్రభాతవార్త:**

మండలం తాండ్ర గ్రామానికి చెందిన ముగ్గురు లబ్ధిదారులకు సోమవారం ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కులను అందజేశారు. నిర్మల్ జిల్లా కాంగ్రెస్ పార్టీ కోశాధికారి దశరథ్ రాజేశ్వర్ తన కార్యాలయంలో ఈ చెక్కులను పంపిణీ చేశారు. బాధితులు రొడ్డవేణి లస్మన్నకు 60,000 రూపాయలు, కమటి గొల్ల శ్రీలతకు 60,000 రూపాయలు, కొట్టూర్ విజయలక్ష్మికి 38,000 రూపాయల విలువైన చెక్కులను వేర్వేరుగా అందజేశారు. ఈ కార్యక్రమంలో నిర్మల్ జిల్లా కాంగ్రెస్ పార్టీ ప్రధాన కార్యదర్శి పొలాస మల్లేష్, సారంగాపూర్ మండల సోషల్ మీడియా కోఆర్డినేటర్ సాక్ పెల్లి సురేందర్, నాయకులు పూసపత్రి రవికుమార్ పాల్గొన్నారు.

## అంబేద్కర్ విగ్రహ ప్రతిష్టాపనకు భూమి పూజ

**జన్నారం, మార్చి 30, ప్రభాతవార్త**

జన్నారం మండలం మొర్రిగూడెం గ్రామంలో అంబేద్కర్ విగ్రహ ప్రతిష్టాపన కోసం భూమి పూజ కార్యక్రమం నిర్వహించారు. ఏప్రిల్ 14 రోజున అంబేద్కర్ జయంతిని పురస్కరించుకొని విగ్రహ ఆవిష్కరణ ఉంటుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ విజయ లచ్చన్న,జన్నారం మండల అంబేద్కర్ సంఘం అధ్యక్షుడు భరత్ కుమార్ మాజీ జడ్పీటిసి పంకజ, తిమ్మాపూర్ గ్రామ మాజీ సర్పంచ్ జాడి గంగాధర్ రిటైర్డ్ టీచర్ పిట్ట రాజారావు, గ్రామ పెద్దలు, వార్డు మెంబర్లు, యూత్ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.



### వెంటనే మెడికల్ బోర్డులు నిర్వహించి

# కార్మికులకు న్యాయం చేయాలి

**- టీబీజీకేఎస్ రాష్ట్ర అధ్యక్షులు మిర్యాల రాజిరెడ్డి - శ్రీరాంపూర్ ఏరియా జనరల్ మేనేజర్‌కు వినతిపత్రం అందజేత**

**నస్పూర్, మార్చి 30, ప్రభాతవార్త**



శ్రీరాంపూర్ జీఎంకు వినతిపత్రం అందజేస్తున్న టీబీజీకేఎస్ రాష్ట్ర అధ్యక్షులు మిర్యాల రాజిరెడ్డి బృందం

ఎన్నికల సమయంలో నెలకు మూడు మెడికల్ బోర్డులు నిర్వహిస్తామని, నూటికి నూరు శాతం అన్‌ఫిట్ చేయిస్తామని మోసపూరిత వాగ్దానాలు చేసిన కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక కార్మికులను వంచించిందని తెలంగాణ బొగ్గు గని కార్మిక సంఘం (టీబీజీకేఎస్) రాష్ట్ర అధ్యక్షులు మిర్యాల రాజిరెడ్డి విమర్శించారు. సోమవారం శ్రీరాంపూర్ ఏరియా జనరల్ మేనేజర్ మునిగంటి శ్రీనివాస్‌ను కలిసి కార్మికుల సమస్యలపై వినతిపత్రం సమర్పించారు. శాసనమండలిలో డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క మెడికల్ బోర్డు నియామకాలపై ఏసీబీ దర్యాప్తు జరుగుతోందని ప్రకటించడం కార్మిక వర్గాన్ని విస్మయానికి గురిచేసిందని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వ తీరు కార్మికుల మనోభావాలను తీవ్రంగా దెబ్బతీసేలా ఉందని ధ్వజమెత్తారు. గత ఏడాది కాలంగా మెడికల్ బోర్డు కోసం ఎదురుచూస్తున్న రెండు వేల మందికి పైగా కార్మికులకు తక్షణమే న్యాయం చేయాలని రాజిరెడ్డి డిమాండ్ చేశారు. గతేడాది జూలై, నవంబర్ నెలల్లో అర్హత ఉండి కూడా అన్‌ఫిట్ కాని కార్మికులకు తిరిగి వైద్య పరీక్షలు నిర్వహించాలి. మెడికల్ ఫిట్ అయిన 300 మందికి పైగా డిపెండెంట్లకు వెంటనే ఉద్యోగాలు కల్పించాలి. విజిలెన్స్, మారుపేర్ల సమస్యలను యాజమాన్యం ప్రాధాన్యత క్రమంలో పరిష్కరించాలి. కార్మిక వ్యతిరేక చర్యలు చేపడుతున్న ప్రభుత్వం, గుర్తింపు సంఘాల తీరును నిరసిస్తూ సింగరేణి వ్యాప్తంగా దశలవారీ పోరాటాలు చేపట్టనున్నట్లు వెల్లడించారు. ఈ నిరసన కార్యక్రమంలో టీబీజీకేఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కేతిరెడ్డి సురేందర్ రెడ్డి, బీఆర్ఎస్ యువ నాయకులు నడిపల్లి విజిత్ రావు, ఏరియా ఉపాధ్యక్షులు బండి రమేష్, కేంద్ర సంయుక్త కార్యదర్శి పారుగంటి సత్తయ్య, కేంద్ర చీఫ్ ఆర్గనైజింగ్ సెక్రటరీ పొగాకు రమేష్, కేంద్ర ఆర్గనైజింగ్ సెక్రటరీ అన్వేష్ రెడ్డి, బీఆర్ఎస్ నస్పూర్ అధ్యక్షులు అక్కురి సుబ్బయ్య, గుమ్మడి శ్రీనివాస్, వంగ తిరుపతి, కేంద్ర కమిటీ నాయకులు, వివిధ గనుల పిట్ సెక్రటరీలు తదితరులు పాల్గొన్నారు.




పోడియం అందజేస్తున్న సీఐ వెంకటేష్

## పాఠశాల అభివృద్ధికి కృషి చేస్తాను: ఎక్సైజ్ సీఐ వెంకటేష్

**భైంసా, మార్చి 30, ప్రభాతవార్త:**

భైంసా పట్టణంలోని గుజిరిగల్లి శ్రీ సరస్వతీ శిశు మందిర్ పాఠశాల అభివృద్ధికి నిరంతరం కృషి చేస్తానని ఎక్సైజ్ సీఐ వెంకటేష్ తెలిపారు. ఈ పాఠశాల పూర్వ విద్యార్థి అయిన ఆయన, విద్యార్థుల సౌకర్యార్థం పాఠశాలకు ఒక పోడియంను బహుకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తాను చదువుకున్న పాఠశాలలో క్రమశిక్షణ, విలువలు, ఆత్మీయత నేర్చుకోవడం వల్లే ఈ స్థాయికి చేరుకున్నానని సంతోషం వ్యక్తం చేశారు. చిన్ననాటి స్నేహితుల భాగస్వామ్యంతో పాఠశాల పురోభివృద్ధికి తోడ్పడతానని పేర్కొన్నారు. విద్యార్థులు ఒక లక్ష్యంతో చదువుకుని ఉన్నత శిఖరాలను అధిరోహించాలని, తల్లిదండ్రులకు, గురువులకు మంచి పేరు తీసుకురావాలని కోరారు. శిశు మందిరాల్లో చదువుకున్న ఎందరో విద్యార్థులు నేడు ఉన్నత స్థానాల్లో ఉన్నారని కొనియాడారు. ఈ కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి పురస్తు గోపాల్ కిషన్, పాఠశాల అధ్యక్షుడు డి శ్రీధర్, సమితి సభ్యులు శివ కుమార్ బచ్చువార్, ఎన్ సురేష్, పెండెప్ కాశీనాథ్, సుదర్శన్, ఎం రాజు గంగాధర్, జి లక్ష్మణ్, జి సాయినాథ్, ప్రధానాచార్యులు శ్రీరాముల గంగాధర్, ఆచార్యులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## కేజీబీవీలో స్వీపర్ పోస్టుకు దరఖాస్తుల ఆహ్వానం

**దిలావర్పూర్, మార్చి 30, ప్రభాతవార్త:**

దిలావర్పూర్ మండలంలోని కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయంలో స్వీపర్ పోస్టుకు దరఖాస్తు చేసుకోవాలని మండల విద్యాధికారి సదానంద్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. పదవ తరగతి ఉత్తీర్ణులై, స్థానికంగా నివసించే ఎస్టీ మహిళలు ఈ పోస్టుకు అర్హులని పేర్కొన్నారు. అర్హత కలిగిన వారు ఏప్రిల్ 1 నుండి 4వ తేదీ వరకు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. కుల ధ్రువీకరణ పత్రం, ఎస్సెస్సీ మెమో, నివాస ధ్రువీకరణ, ఆధార్ కార్డు పత్రాలను జతచేసి మండల విద్యా వనరుల కేంద్రంలో సమర్పించాలని వివరించారు. అర్హులైన మహిళలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

# క్రీడా మైదానాన్ని అభివృద్ధి చేయాలి

**ఆసిఫాబాద్, మార్చి 30, ప్రభాతవార్త :**

జిల్లా కేంద్రంలోని జనకాపూర్ క్రీడా మైదనంను అభివృద్ధి చేయాలని డివైఎఫ్ఐ, కెవిపిఎస్ నాయకులు జిల్లా కలెక్టర్ హరితను కోరారు. సోమవారం కలెక్టరేట్ లోని సమావేశం మందిరంలో నిర్వహించిన ప్రజావాణిలో పలు సంఘాల ఆధ్వర్యంలో వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా డివైఎఫ్ఐ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు గేడం టీకానంద్, గోడిసెల కార్తీక్ మాట్లాడుతూ గతంలో క్రీడా మైదానం అభివృద్ధి కొరకు దాదాపు 22 లక్షల రూపాయలతో నిధులు మంజూరు చేసి ఒక కాంట్రాక్టర్ కి అభివృద్ధి పనులు అప్పగించారని, సదురు కాంట్రాక్ట్ కొంతమేరకు పనులు చేసి ఆపేశారని ఆరిపించారు. జిల్లాలో అనేకమంది క్రీడాకారులు క్రీడలలో నైపుణ్యం కలిగి ఉన్నప్పటికీ సరైన క్రీడ మైదానం లేక క్రీడకారులు, యువత ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తంచేశారు. పలు క్రీడల్లో నైపుణ్యాలు ఉన్నప్పటికీ సరైన క్రీడా మైదానం లేక రాష్ట్ర, జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో జిల్లా క్రీడాకారులు పైస్థాయికి వెళ్లలేక నష్టపోతున్నారన్నారు. క్రీడ మైదానంలో అన్నిరకాల మోలికవసతులు ఏర్పాటు చేసి పిచ్చి మొక్కలను తొలగించాలని పేర్కొన్నారు. మందుబాబులకు అడ్డగా మారిన క్రీడ మైదానానికి నైట్ వాచ్మెన్ తో పాటు రాత్రిపూట పోలీసుల పరవేక్షణ ఉండేటట్లు చూడాలని కలెక్టర్ ను కోరినట్లు వెల్లడించారు. అన్ని విధాలుగా క్రీడ మైదానాన్ని అభివృద్ధి చేసి క్రీడాకారులకు అందుబాటులో ఉండేలా చూస్తామని జిల్లా కలెక్టర్ సానుకూలంగా స్పందించారని తెలిపారు. ఈ కార్యక్రమంలో కెవిపిఎస్ జిల్లా ఉపాధ్యక్షులు మల్లేష్ తదితరులు పాల్గొన్నారు.



జిల్లా కలెక్టర్ కె హరితకు వినతిపత్రం అందజేస్తున్న డివైఎఫ్ఐ నాయకులు

# సమిష్టి కృషితో 2026-27లోనూ ఎస్సార్పీ 1 గనిని అగ్రస్థానంలో నిలపాలి

### - శ్రీరాంపూర్ జీఎం మునిగంటి శ్రీనివాస్

**నస్పూర్, మార్చి 30, ప్రభాతవార్త**

రానున్న ఆర్థిక సంవత్సరంలోనూ నిర్దేశిత లక్ష్యాలను అధిగమించి సింగరేణిలోనే నంబర్ వన్ గనిగా ఎస్సార్పీ 1 గనిని తీర్చిదిద్దాలని శ్రీరాంపూర్ ఏరియా జనరల్ మేనేజర్ మునిగంటి శ్రీనివాస్ పిలుపునిచ్చారు. సోమవారం ఉదయం ఆయన ఎస్సార్పీ 1 గనిని సందర్శించారు. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో సంస్థలోని అన్ని భూగర్భ గనులు, ఓసీపీల కంటే ముందే ఉత్పత్తి లక్ష్యాన్ని సాధించినందుకు అధికారులను అభినందించారు. ఇదే ఒరవడిని 2026 -27లోనూ కొనసాగించేలా అనుసరించాల్సిన వ్యూహాలపై దిశానిర్దేశం చేశారు. ఈ నెలతో ఉత్పత్తి నిలిచిపోవాల్సిన ఎస్సార్పీ 1 గనికి రానున్న ఏడాదికి కూడా ఉత్పత్తి లక్ష్యాలు కేటాయించడంతో పాటు గని కొనసాగింపునకు అనుమతులు లభించాయి. లభించిన ఈ సువర్ణావకాశాన్ని అధికారులు, కార్మికులు సమిష్టిగా సద్వినియోగం చేసుకోవాలని జీఎం సూచించారు. కొత్తగా తిరిగి ప్రారంభించిన 1 సీమ్‌లో కొనసాగుతున్న అభివృద్ధి పనులను ఆయన క్షేత్రస్థాయిలో పరిశీలించారు. పని ప్రదేశాల పునరుద్ధరణ పనులను వేగవంతం చేసి వీలైనంత త్వరగా ఉత్పత్తి ప్రారంభించేలా చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు.


ఎస్సార్పీ I గని మ్యాపులను అధికారులతో కలిసి పరిశీలిస్తున్న జీఎం మునిగంటి శ్రీనివాస్

అనంతరం గని మేనేజర్ కార్యాలయంలో గ్రూప్ ఏజెంట్, మేనేజర్, సర్వేయర్లతో కలిసి వర్కింగ్ ప్లేస్ మ్యాపులను సమీక్షించారు. సంస్థ నిర్దేశించిన లక్ష్యాలకు అనుగుణంగా రక్షణతో కూడిన ఉత్పత్తికి ప్రణాళికాబద్ధంగా సిద్ధం కావాలని స్పష్టం చేశారు. వచ్చే ఏడాదికి కావాల్సిన పనిముట్లు, సామాగ్రిని ముందుగానే సేకరించుకోవాలని సూచించారు. మెరుగైన ఓఎంఎస్ సాధించి సింగరేణిలో మరోసారి విశిష్ట గుర్తింపు తీసుకురావాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో గ్రూప్ ఏజెంట్ జి. రవికుమార్, గని మేనేజర్ ఆత్మారాం సహాని, సర్వేయర్ టి. సంతోష్ పాల్గొన్నారు.


ధర్నా చేస్తున్న విద్యుత్ కార్మికులు

## విద్యుత్ కార్మికుల సమస్య లను పరిష్కరించాలి

**ఆసిఫాబాద్, మార్చి 30, ప్రభాతవార్త :**

విద్యుత్ సంస్థలో పని చేస్తున్న కార్మికుల సమస్యలు పరిష్కరించాలని తెలంగాణా విద్యుత్ ఆర్టిసన్ ఎంప్లాయిస్ జాయింట్ యాక్షన్ కమిటీ జిల్లా చైర్మన్, కన్వీనర్ లు ఆత్రం మారుతి, షేక్ నసీరుద్దీన్‌లు డిమాండ్ చేశారు. సోమవారం జిల్లా కేంద్రంలోని విద్యుత్ శాఖ డివిజన్ కార్యాలయం వద్ద దశల వారి ఆందోళన కార్యక్రమాల్లో భాగంగా కార్మికులు ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఆర్టిసన్ కార్మికులకు ఏపీఎస్పీబీ సర్వీస్ రూల్స్ అమలు చేసి విద్యా అర్హతలను బట్టి కన్వర్షన్ చేయాలన్నారు. ఆన్మాన్ కార్మికులను ఆర్టిజన్ గా గుర్తించాని, ఫీస్రేట్ కార్మికులకు జీవో నం.11 ప్రకారం కనీస వేతనం అమలు చేసి 2026 వేతన సవరణ ప్రకటించాలని పలు డిమాండ్లు చేశారు. తమ డిమాండ్లు తీర్చలేని పక్షంలో వచ్చే నెల 8 నుంచి నిరవధిక సమ్మెకు సైతం వెనకాడబోమని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఆసిఫాబాద్ జిల్లా, డివిజన్ నాయకులు బుచ్చిబాబు, లక్ష్మిమన్, అశోక్, సతీష్, మలేష్, శిరీష, ప్రేమ్ సాగర్, రమేష్, రాజ్ కుమార్, రవి, పవన్ కుమార్, శేఖర్ తో పాటు జిల్లా లోని వివిధ మండలాల విద్యుత్ కార్మికులు పాల్గొన్నారు.

## ప్రమాదకరంగా కరెంట్ స్తంభం..

**బెల్లంపల్లి, మార్చి 30, ప్రభాతవార్త**



బెల్లంపల్లి మున్సిపాలిటీ 28వ వార్డులో శిథిలావస్థకు చేరిన కరెంట్ స్తంభం స్థానిక ప్రజలకు ప్రమాదకరంగా మారిందని ఎం.సి.పి.ఐ.యు జిల్లా సహాయ కార్యదర్శి పసులేటి వెంకటేష్ ఆందోళన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఎం.సి.పి.ఐ.యు పార్టీ కార్యాలయంలో మాట్లాడుతూ ఆయన తెలిపారు. గత కొన్ని సంవత్సరాలుగా ఈ స్తంభం ప్రమాదకర స్థితిలో ఉన్నప్పటికీ, పలుమార్లు విద్యుత్ శాఖ అధికారులకు ఫిర్యాదు చేసినా స్పందన లేకపోవడం బాధాకరమన్నారు. ఇప్పటికే కొత్త స్తంభం మంజూరైనప్పటికీ దాన్ని అమలు చేయకుండా అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని విమర్శించారు. ప్రస్తుతం ఎండాకాలం కావడంతో ఈదురుగాలులు ఎక్కువగా వీస్తున్నాయని, ఇలాంటి పరిస్థితుల్లో స్తంభం విరిగి పడే ప్రమాదం ఉందని హెచ్చరించారు. ఇది ఎప్పుడైనా ప్రాణ నష్టం కలిగించే ప్రమాదం ఉన్నందున వెంటనే చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. 28వ వార్డులోని శిథిలమైన కరెంటు స్తంభాన్ని తక్షణమే మార్చి ప్రజల ప్రాణాలను రక్షించాలని విద్యుత్ శాఖ అధికారులను కోరారు. లేనిపక్షంలో స్థానిక ప్రజలతో కలిసి విద్యుత్ శాఖ కార్యాలయం ఎదుట ధర్నా చేపడతామని హెచ్చరించారు. ప్రజల భద్రతపై అధికారులు వెంటనే స్పందించాలని స్థానికులు కూడా కోరుతున్నారు.

## చిరుతల రామాయణానికి రూ.50 వేల అందజేత

**వేమనపల్లి, మార్చి 30, ప్రభాతవార్త**



వేమనపల్లి మండలం ముల్కలపేటలో నాలుగు రోజులుగా సాగుతున్న చిరుతల రామాయణ ప్రదర్శనకు బీఆర్ఎస్ మండల అధ్యక్షులు కోలి వేణుమాధవ్ రావు హాజరయ్యారు. ఈ సందర్భంగా కళాకారులను ప్రోత్సహిస్తూ రూ. 50 వేల విరాళం అందజేశారు. ప్రాచీన కళలను కాపాడుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక సర్పంచ్ ఓడీల కళ్యాణి సుధాకర్, మాజీ సర్పంచ్ బోర్కుటి సంతోష్, బెడ్డల రాజలింగు, మాజీ ఎంపీటీసీ దాగామ బాపు, మండల నాయకులు పురాణం లక్ష్మీకాంత్, మాజీ పిఎసిఎస్ చైర్మన్ కుబిడే వెంకటేష్, మాజీ సర్పంచ్ లు గొంతుమెర, మోర్ల మొండి, కొండగొర్ల బాపు, దుర్గం సక్కుబాయి, ఉప సర్పంచ్ బోర్కుటి నరేష్, మాజీ ఉప సర్పంచ్ కొండ్ర పున్నం, మండల యువజన నాయకులు చెన్నూరి సంతోష్ కుమార్, ఇరుగురాల రజోక్, మండల నాయకులు కొప్పుల మధునయ్య, చెన్నూరి వెంకటి, చిగురాల లక్ష్మణ్, పార్టీ ఉపాధ్యక్షులు కుమ్మరి బాపు, దుర్గం సుధాకర్, కొండ్ర పోచం, బిఆర్ఎస్వి మండల అధ్యక్షులు బుర్రి రమేష్ వార్డు సభ్యులు పాలే కిరణ్, ఎడ్ల మహేష్, బోర్కుటి తిరుపతి రామాయణ కమిటీ పెద్దలు, తదితరుల పాల్గొన్నారు.

## ఉత్పత్తి లక్ష్యాలను అధిగమించిన బెల్లంపల్లి ఏరియా

### - ఖైరిగురలో రికార్డు సృష్టి

**బెల్లంపల్లి, మార్చి 30, ప్రభాతవార్త**



అధికారుల సమర్థమైన మార్గనిర్దేశం, ఉద్యోగుల సమష్టి కృషి ఫలితంగా బెల్లంపల్లి ఏరియా 2025-26 ఆర్థిక సంవత్సరానికి నిర్దేశించిన ఉత్పత్తి లక్ష్యాలను రెండు రోజుల ముందుగానే అధిగమించింది. బెల్లంపల్లి ఏరియాకు ఈ ఏడాది 35 లక్షల టన్నుల ఉత్పత్తి లక్ష్యం ఉండగా, 35.14 లక్షల టన్నుల బొగ్గు ఉత్పత్తి, రవాణా సాధించి లక్ష్యాన్ని మించి విజయాన్ని నమోదు చేసింది. ఈ సందర్భంగా సోమవారం ఖైరిగుర ఉపరితల గని వద్ద జనరల్ మేనేజర్ ఎం. విజయ భాస్కర రెడ్డి ఏరియా అధికారులు, పర్యవేక్షకులతో సమావేశం నిర్వహించారు. ఖైరిగుర ఓసి, సిహెచ్‌పి అధికారులు లక్ష్య సాధనలో కృషి చేసిన ప్రతి ఒక్కరిని అభినందించారు. ఇదిలా ఉండగా, ఖైరిగుర ఓసి ఒక్క రోజు ఉత్పత్తి, రవాణాలో సరికొత్త చరిత్ర సృష్టించింది. మార్చి 29 (ఆదివారం) ఒక్క రోజే 26,426 టన్నుల బొగ్గు ఉత్పత్తి, రవాణా చేసి గత రికార్డులను అధిగమించింది. ఈ కార్యక్రమంలో ఖైరిగుర ప్రాజెక్ట్ ఆఫీసర్ మచ్చగిరి నరేందర్, ఏరియా ఇంజనీర్ కృష్ణమూర్తి, ప్రాజెక్ట్ ఇంజనీర్ వీరన్న, మేనేజర్ జే. శంకర్‌తో పాటు వివిధ విభాగాల అధిపతులు, పర్యవేక్షకులు, అధికారులు పాల్గొన్నారు.


వినతిపత్రం అందజేసిన సర్పంచ్ తదితరులు

## వంజిరి గ్రామపంచాయతీ సమస్యలపై జిల్లా కలెక్టర్‌కు వినతి


**కాగజ్‌నగర్ రూరల్, మార్చి 30, ప్రభాతవార్త :**

కాగజ్‌నగర్ మండలంలోని వంజిరి గ్రామపంచాయతీ పరిధిలో నెలకొన్న పలు సమస్యలను పరిష్కరించాలని కోరుతూ గ్రామ సర్పంచ్, ఉప సర్పంచ్,వార్డు సభ్యులు సోమవారం జిల్లా కలెక్టర్‌కు వినతి పత్రం అందజేశారు. గ్రామంలో తాగునీటి సమస్య, రోడ్ల దుస్థితి, డ్రైనేజీ సమస్యలు, వీధి దీపాల కొరత, పింఛన్లు, ఇతర ప్రాథమిక సౌకర్యాల లోపాల గురించి కలెక్టర్ వివరించి త్వరితగతిన పరిష్కరించాలని కోరుతూ దరఖాస్తులు అందజేశారు.ఈ సందర్భంగా గ్రామ సర్పంచ్ మాట్లాడుతూ, గ్రామ అభివృద్ధికి అవసరమైన చర్యలు తీసుకోవాలని అధికారులను కోరారు. జిల్లా కలెక్టర్ సమస్యలను పరిశీలించి తగిన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చినట్లు వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్, ఉప సర్పంచ్, వార్డు సభ్యులు, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

## గ్రామ సభలకు సంబంధిత అధికారులు తప్పనిసరిగా హాజరు కావాలి

**ఆసిఫాబాద్, మార్చి 30, ప్రభాతవార్త :**

గ్రామ సభలకు సంబంధిత అధికారులు తప్పనిసరిగా హాజరు కావాలని జిల్లా కలెక్టర్ హరిత పేర్కొన్నారు. సోమవారం కలెక్టరేట్ లోని సమావేశ మందిరంలో ఏర్పాటు చేసిన ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యక్రమంలో అదనపు కలెక్టర్ ఏం. డేవిడ్, ఆసిఫాబాద్ రాజస్వ మండల అధికారి లోకేశ్వర్ రావు తో కలిసి కలెక్టర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలోని అన్ని గ్రామ పంచాయతీలలో నిర్వహ్నించే గ్రామ సభలకు సంబంధిత శాఖల అధికారులు తప్పనిసరిగా పాల్గొనాలని సూచించారు. ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన 99 రోజుల ప్రజా పాలన ప్రగతి ప్రణాళికా కార్యక్రమంలో భాగంగా ప్రతి గ్రామ పంచాయతీలలో ఏప్రిల్ 2న గ్రామ సభలు నిర్వహించాలన్నారు. సర్పంచుల అధ్యక్షతన నిర్వహించే గ్రామసభలలో సంబంధిత శాఖల అధికారులు పాల్గొని వచ్చే వివిధ సమస్యలపై వెంటనే స్పందించాలన్నారు. గ్రామ సభలో అవసరమైన షామియని, త్రాగు నీరు అందుబాటులో ఉంచాలన్నారు. గ్రామ సభలను విజయవంతం చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో పలు శాఖల అధికారులు పాల్గొన్నారు.


అధికారులతో మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్ హరిత